## మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా శేఖర్

మెదక్ అర్బన్, డిసెంబర్ 19 : మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని లింగంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాచారం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్, ఉపాధ్యక్షులుగా స్వామి, డాక్టర్ సురేశ్‌బాబు, చంద్రం, అదనపు కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా పోచయ్య, సభ్యులుగా శంకర్, డి.శంకర్, గణేశ్, నాగరాజు, విజయ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## నార్సింగి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం

చేగుంట, డిసెంబర్ 19: నార్సింగి సొసైటీ చైర్మన్ శంకర్‌గౌడ్‌పై అవిశ్వాసానికి సంబంధించిన తీర్మానం కాపీని మెదక్‌లోని డీసీవోకు 8మంది సొసైటీ డైరెక్టర్లు మంగళవారం అందజేశారు. చైర్మన్ శంకర్‌గౌడ్ ఏకపక్షంగా వ్యవహరించడంతో డైరెక్టర్లు స్వామి, నర్సింహాచారి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిరాములు, సత్తయ్య, నాగలక్ష్మి, మల్లయ్య అవిశ్వాసం పెడుతున్నట్లు తెలిపారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నేతలు



మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నేతలు

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- మంత్రులను కలిసిన ఎస్టీయూ సంఘం నాయకులు

వెల్దుర్తి, డిసెంబర్ 19 : మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబును మంగళవారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం కలిశారు. మంగళవారం సచివాలయంలో మంత్రులను కలిసిన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశానికి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలల్లో పరిశుభ్రత కోసం సర్వీస్ పర్సన్ల నియామకం, మండలానికో ఆదర్శ పాఠశాల ఏర్పాటు, పాఠశాల ప్రారంభం నాటికే పుస్తకాలు, యూనిఫాం, బూట్లు అం దించాలన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో యాదాద్రి జిల్లా శాఖ అధ్యక్షుడు వెంకటేశం, మెదక్ జిల్లా బాధ్యులు రామకృష్ణ ఉన్నారు.

## టెక్నికల్ కోర్సు పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 19: డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని మెదక్ డీఈవో రాధాకిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 7వ తరగతిలో ఉత్తీర్ణత లైన వారు లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్షకు అర్హులన్నారు. లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్ష లేదా లోయర్ గ్రేడ్‌కు సరిసమానమైన టెక్నికల్ పరీక్ష పాసైన వారు సంబంధిత హయ్యర్ గ్రేడ్ పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. www.bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 29లోపు డ్రాయింగ్ లోయర్‌కు రూ.100, హయ్యర్‌కు రూ.150 వెబ్ అప్లికేషన్లు అందజేయాలన్నారు. టైలరింగ్ లోయర్‌కు రూ.150. హయ్యర్‌కు రూ.200, ఆలస్య రుసుం రూ.50తో జనవరి 5వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

## నేటి నుంచి డైట్ ధ్రువపత్రాల పరిశీలన

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 19 : హవేళీ ఘనపూర్‌లోని జిల్లా విద్యాశిక్షణ సంస్థలో నేటి నుంచి డైట్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు అనివార్య కారణాలతో రాని అభ్యర్థులు మాత్రమే రావాలని కోరారు. అభ్యర్థులు ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, టీసీతోపాటు నాలుగు నుంచి పదో తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్పెషల్ కేటగిరీ సర్టిఫికెట్లు (ఎన్‌సీసీ, స్పోర్ట్స్, దివ్యాంగులు, సైన్యంలో పని చేసిన వారు) ఉన్నవారు ఈ నెల 22 నుంచి 27వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. 30న సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. సీటు పొందిన అభ్యర్థులు జనవరి 1 నుంచి 3 వరకు అలాట్‌మెంట్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకొని జనవరి 5 వరకు కేటాయించిన కళాశాలలో అడ్మిషన్ పొందాలన్నారు.

# మృతుడి కుటుంబానికి అండగా ఉంటా

- మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు
- రూ.లక్షా 25వేల ఆర్థిక సాయం

రామాయంపేట/నిజాంపేట డిసెంబర్ 19: గల్ఫ్ దేశం కువైట్‌లో బాత్‌రూంలో పడి మృతిచెందిన బాధిత కుటుంబాన్ని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పరామర్శించారు. మంగళవారం రామాయంపేట ఉమ్మడి నిజాంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన సాకలి బాబు (35) మూడేండ్లుగా కువైట్‌లోని ఓ కంపెనీలో పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి బాత్‌రూంలో పడి తలకు తీవ్రగాయాలు కాగా, అక్కడే ఓ దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాబు కుటుంబాన్ని మైనంపల్లి పరామర్శించి రూ.లక్షా 25వేలు ఆర్థిక సాయం అందజేశారు. మైనంపల్లి వెంట టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, మాజీ ఎంపీపీ యేసుగారి రమేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల బాలయ్య, ఇమ్రాన్, సిద్ది రాము లు, కట్ట శ్రీనువాస్, మెడి గణేశ్, రవీందర్‌రెడ్డి, మహేందర్, విప్లవ్, బైరం కుమార్, లింగ స్వామి, గంగాధర్ ఉన్నారు.

### పుట్టిన రోజు వేడుకకు మైనంపల్లి

నిజాంపేట, డిసెంబర్ 19 : నిజాంపేటలోని రేణుక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎంఎస్‌ఎస్‌వో మండల ఇన్‌చార్జి వెంకటేశ్‌గౌడ్ కూతురు రియాన్షిక పుట్టిన రోజు కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సుప్రభాతరావు, మహేందర్, మారుతి, నరేందర్, మహేశ్, నసీరొద్దీన్, శ్రీకాంత్, శ్రీకాంత్‌గౌడ్, రాములు, రమేశ్, బాల్‌రాజ్‌గౌడ్, భూమగౌడ్ ఉన్నారు.

# ప్రమాదవశాత్తు చెరుకు తోట దగ్ధం



దగ్ధమైన మూడెకరాల చెరుకు పంట తోట

- బాధిత రైతుకు రూ.3లక్షల నష్టం

రామాయంపేట, డిసెంబర్ 19 : ప్రమాదవశాత్తు చెరుకు తోట దగ్ధమైన ఘటన రామాయంపేట శివారులోని మంగళవారం జరిగింది. బాధిత రైతు వివరాల ప్రకారం.. మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన రైతు కిచ్చయ్యగారి రామచంద్రారెడ్డికి చెందిన మూడెకరాల చెరుకు తోట ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. విషయం తెలుసుకున్న రామాయంపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పారు. సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు రామచంద్రారెడ్డి తెలిపారు.

### పూరి గుడిసె దగ్ధం

చేగుంట, డిసెంబర్ 19: ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన ఘటన శేరిపల్లి గ్రామంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల నర్సింహులు పూరి గుడిసెలో అతడి భార్య లక్ష్మి మంగళవారం ఉదయం వంట చేస్తున్న సమయంలో గుడిసెకు ప్రమాదవశాత్తు మంటలు చెల రేగడంతో స్థానికుల సహాయంతో మంటలు ఆర్పగా, అప్పటికే విలువైన సామాన్లు కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## పేకాట రాయుళ్ల అరెస్టు

నర్సాపూర్, డిసెంబర్ 19 : పేకాట ఆడుతున్న 19మంది వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన మండలంలోని నత్నాయిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై శివకుమార్ వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి 12.30 సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు నత్నాయిపల్లి సమీపంలో గల అటవీ ప్రాంతంలో గోపాల్ అనే వ్యక్తికి చెందిన రేకుల షెడ్డులో పేకాట ఆడుతున్నారని ఎస్సై తన సిబ్బందితో రైడ్ చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.1,47,190 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## నాలుగోరోజు ధనుర్మాస పూజలు

రామాయంపేట, డిసెంబర్ 19 : రామాయంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు నాలుగో రోజు ఘనంగా జరిగాయి. మంగళవారం వేంకటేశ్వర ఆలయంలో భక్తులు అమ్మవారిని పూలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి మంగళహారతులు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి కానుకలు అందజేశారు. కానుకలు అందజేసిన భక్తులకు పూజారి వెన్న పంతులు, ఆలయ కమిటీ నిర్వాహకులు దాతలను శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.



అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

## గర్భిణులకు సామూహిక సీమంతాలు

శివ్వంపేట, డిసెంబర్ 19 : శివ్వంపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డేను నర్సాపూర్ సీడీపీవో హేమభార్గవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల ఎదుగుదలను చూసి పత్రాలు అందించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించడంతోపాటు గర్భిణులకు సీమంతాలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, నవీన, ఏఎన్‌ఎం రేణుక, ఆశ కార్యకర్త అనూష పాల్గొన్నారు.

# గడ్డి మందు తాగి భర్త ఆత్మహత్య

నర్సాపూర్, డిసెంబర్ 19: భార్యతో గొడవపడి భర్త గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. కొల్చారం మండలం రంగంపేట్ గ్రామానికి చెందిన సార చంద్రశేఖర్‌కు(28) నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర శమంతతో 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. పెండ్లి జరిగిన కొత్తలో 6నెలలు బాగానే ఉన్నా ఆ తర్వాత తరుచూ గొడవ పడుతుండేవారు. శమంత భర్తతో గొడవపడి తల్లిగారింటికి వెళ్లేది. పెద్దల సమక్షంలో ఇప్పటికే ఆరుసార్లు పంచాయితీ పెట్టించి ఒకటి చేశారు. రెండు నెలల క్రితం శమంత పాపకు జన్మనిచ్చింది. 20 రోజుల కింద రంగంపేట్‌లో తొట్టెల కార్యక్రమం నిర్వహించారు. తర్వాత తల్లిగారిల్లు రెడ్డిపల్లికి వెళ్లింది. చంద్రశేఖర్ ఈ నెల 17న సాయంత్రం తన కూతురిని చూడడానికి రెడ్డిపల్లి వెళ్లాడు. అదేరోజు రాత్రి దంపతులిద్దరు గొడవపడ్డారు. ఈ క్రమంలో చంద్రశేఖర్ గడ్డి మందు తాగాడు. వెంటనే అతడిని నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు పంపించారు. దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తన కొడుకు మృతిపై శమంత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై అనుమానం ఉన్నదని మృతుడి తండ్రి సార యాదయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

## 'సృజన టెక్ ఫెస్ట్'ను వినియోగించుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 19 : ఈ నెల 21న మెదక్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాస్థాయిలో నిర్వహించే 'సృజన టెక్ ఫెస్ట్'ను సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

## కోరం లేక సమావేశం వాయిదా

నర్సాపూర్, నవంబర్ 19 : మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి మెజార్టీ సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూ కోరం లేనందున ఈ సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పాపన్నపేట, డిసెంబర్ 19: కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆర్థికసాయం అందజేశారు. పాపన్నపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గులాం దస్తగిరి కుమారుడు ఎండీ నిసార్ మంగళవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.10వేలు బాధిత కుటుంబసభ్యులకు తన అనుచరుల ద్వారా పంపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టాలి

కొల్చారం, డిసెంబర్ 19: ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా అన్నారు. కొల్చారంలోని రైతువేదికలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు ఓటరు నమోదుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073. NT-314374

★రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేల కమీషన్. 9281452762, 9515108830. NT-314474

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.